

నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు.


- 10లో



వినూత్నంగా ఉగాది వేడుకలు

మోత్కూరులో మంగళవారం ఉగాది పర్వదినం సందర్భంగా ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించారు.

- 10లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-36

(బుధవారం సా॥)

న్యూస్‌రీల్

సూర్యాపేట మార్కెట్‌కు రెండు రోజులు సెలవు

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు రెండురోజుల పాటు సెలవు ప్రకటిస్తున్నట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న రంజాన్‌తో పాటు శుక్రవారం ప్రభుత్వ ఆదేశానుసారం యార్డుకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. ఈ రెండురోజుల పాటు యార్డుకు ధాన్యాన్ని తీసుకొచ్చి రైతులు ఇబ్బందులు పడవద్దని, తిరిగి ఈనెల 13వ తేదీన మార్కెట్ పునఃప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.

వైభవంగా గరుడ వాహన సేవ



మట్టపల్లిలో గరుడ వాహన సేవ నిర్వహిస్తున్న భక్తులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో మంగళవారం రాత్రి శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామికి అర్చకులు, భక్తులు గరుడవాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో జయజయధ్వానాల నడుమ ఊరేగించారు.అనంతరం ఆలయ ప్రవేశం గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, మధిర ప్రతాపరెడ్డి, అర్చకులు లక్ష్మణాచార్యులు, బ్రహ్మాచార్యులు, ఆంజనేయాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

యాదాద్రిలో విశేష పూజలు



ఆలయంలో నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో మంగళవారం విశేష పూజలు కొనసాగాయి. ఉగాది సందర్భంగా ప్రధానాలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. క్షేత్రపాలకుడిగా పూజలందుకుంటున్న శ్రీఆంజనేయస్వామికి అర్చకులు ఆకుపూజ నిర్వహించారు. హనుమంతుడికి ఇష్టమైన రోజు కావడంతో ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. అనంతరం హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యం సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు.

పిల్లలమర్రిలో ఒడిబియ్యం



పిల్లలమర్రి ఆలయంలో పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులు

సూర్యాపేట : సూర్యాపేట పట్టణ పరిధిలోని పిల్లలమర్రి శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో ఉగాది పర్వదినం పురస్కరించుకొని కల్యాణం అనంతరం ఒడిబియ్యం, సారే నివేదన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు ముడుంబై రఘువరన్ చార్యులు ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో ఆలయ ధర్మకర్తలు ఉమ్మెంతల హరిప్రసాద్, ఉమ్మెంతల ఆహ్లాదరావు, చైర్మన్ గూకంటి రాజబాబురెడ్డి, గౌరవ సలహాదారుడు గవ్వ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ కందగట్ల రాంబాబు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

• ఎండల్లో హాయ్ హాయ్







ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇలాంటి తరుణంలో అర్వపల్లిలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో నిర్మించిన రెండు కొలనుల్లో యువకులు, పిల్లలు ఈతకొడుతూ ఎండల్లో హాయ్‌హాయ్ అంటూ సేదదీరుతున్నారు. చిన్నపిల్లలు ట్యూబులు, ప్లాస్టిక్ సీసాలు, ఇతర పరికరాలతో ఈత నేర్చుకుంటున్నారు. - అర్వపల్లి

తాగునీటికి తండ్లాట



సాధుతండాలో వ్యవసాయ బోరు వద్ద నుంచి నీటిని తెస్తున్న మహిళలు



మేళ్లచెరువు మండలం హేమ్లాతండా పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్యతో ప్రజలు పడుతున్న ఇబ్బందులకు ఈ ఫొటో అద్దంపడుతోంది. ఈ పంచాయతీ పరిధిలో జగ్గుతండా, రాఘవాపురం, శ్రీరాంనగర్ కాలనీ హ్యాబిటేషన్లు ఉన్నాయి. ఇక్కడ 2వేల జనాభా ఉంది. మూడు ఓవర్‌హెడ్ ట్యాంకులు, 15 నుంచి 20 వరకు బోర్లు ఉన్నాయి. వర్షాభావంతో జనవరిలోనే ఈ బోర్లలో నీళ్లు తగ్గి తాగునీటి సమస్య మొదలైంది. మార్చిలో ఆ బోర్లు కాస్తా పూర్తిగా వట్టిపోయాయి. దీంతో పంచాయతీతో పాటు దాతలు వ్యవసాయ బోర్ల వద్ద నుంచి ట్యాంకర్ల ద్వారా నీళ్లు తెచ్చి సరఫరా చేస్తున్నారు.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లాలో ప్రజలకు అప్పుడే తాగు నీటి కష్టాలు మొదలయ్యాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భజలాలు అడుగంటిపోయాయి. బోర్ల వట్టిపోవడంతో మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా సాగడంలేదు. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నా అవి కూడా సరిపోవడం లేదు. దీంతో ప్రజలు నీటిని కొనుక్కొని తాగాల్సిన దుస్థితి ఏర్పడింది. కొన్ని చోట్ల వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ తదితర అన్ని నియోజకవర్గాల్లో తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు.

చెరువులు, కుంటల్లో నీరు లేక

జిల్లా పరిధిలోని ప్రాజెక్టుల్లో నీరు లేక, రిజర్వాయర్లు, చెరువులు ఎండిపోయి, భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. రోజురోజుకూ వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారుతోంది. పట్టణాలు, మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లోనూ బోర్లు వట్టిపోయి గ్రామ పంచాయితీల్లో ట్యాంకులకు నీరు అందడంలేదు.

40 రోజులుగా తాగునీటి తంటాలు

హుజూర్‌నగర్ మండలంలోని వేపల సింగారం, మిట్టగూడెం గ్రామాల్లో బోర్లు వట్టిపోయాయి. దీంతో 40 రోజులుగా తాగునీటి సమస్య తప్పడం లేదు. గ్రామాల ప్రజలు నానా ఇబ్బంది పడుతున్నారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా అడపాదడపా నీటని సరఫరా చేస్తున్నా సరిపోవడం లేదు. తాజా మాజీ సర్పంచ్ అన్నెం శిరీషా కొండారెడ్డి ఒక ట్రాక్టర్, ఆటో ద్వారా ట్యాంకులు ఏర్పాటు చేసి సరఫరా చేస్తున్నారు. మేళ్లచెరువు మండలంలోని వెల్లటూరు, హేమ్లాతండా, రాఘవాపురం, జగ్గుతండా, కప్పలకుంటతండా, సాధుతండా గ్రామాల్లో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. బోర్లు మరమ్మతు చేయకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని గ్రామస్తులు పేర్కొన్నారు.

అడుగంటిన భూగర్భ జలాలు

- సక్రమంగా సరఫరా కాని మిషన్ భగీరథ నీరు
- బోర్లు వట్టిపోవడంతో సమస్య మరింత జటిలం
- ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నా తీరని సమస్య
- పలు చోట్ల నీటిని కొనుక్కుంటున్న ప్రజలు

పట్టణంలోనూ నీటి సమస్య



నెహ్రూనగర్‌లో ట్యాంకర్ ద్వారా నీటిని కొని ఇంట్లో ట్యాంకుకు ఎక్కిస్తున్న దృశ్యం

సూర్యాపేట పట్టణంలోని పలు వీధుల్లో తాగునీటి సమస్య తీవ్రమవుతోంది. రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తున్నా 40 నిమిషాలకు మించి ఇవ్వడం లేదు. దీంతో ఆ నీరు సరిపోక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దానికితోడు నెలలో ఐదారుసార్లు బోరు మోటార్లు పాడవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. విలీన గ్రామాలకు పూర్తి స్థాయిలో నీరందక అవస్థలుపడుతున్నారు. సూర్యాపేట మండలం ఇమాంపేట్‌లో మిషన్ భగీరథ టాంక్ ఉన్నా తాగునీటికి తిప్పలు తప్పడం లేదు.

చెరువులు ఎండిపోయి..

చిలుకూరు మండలంలోని నారాయణపురం, సీతరాంపురం, బేతవోలులోని కోమటికుంట చెరువు, మాధవగూడెంలోని చెరువులు పూర్తిగా ఎండిపోవడంతో గ్రామాల్లో మంచినీటి కష్టాలు మొదలయ్యాయి. కొమ్ముబండ తండా, జానకీనగర్, దూదియాతండా, సీతరాంతండా, జెర్రిపోతులగూడెం గ్రామాల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. కొమ్ముబండ తండాలో గిరిజనులు పొలాల్లోకి వెళ్లి బోర్ల వద్ద నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది.



చిలుకూరు మండలం కొమ్ముబండ తండాలో అడుగంటిన పురాతన బావి

40 నిమిషాలే ఇస్తున్నారు



మున్సిపాలిటీ నల్లాల ద్వారా రెండు రోజుల కోసారి 40 నిమిషాలే నీళ్లు ఇస్తున్నారు. అవి సరిపోవడం లేదు. దీంతో ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధార పడాల్సి వస్తోంది. కనీసం రెండు గంటలైనా నీటిని సరఫరా చేయాలి.

– శోభ, జమ్మిగడ్డ, సూర్యాపేట

తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం



మా తండాలో బోర్లు రిపేరు చేయకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. తండాలో నీరుదొరక్క సమీపంలోని పొలాల్లో బోరుబావులను, ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. పనులు మానుకొని నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు కల్పించుకొని తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

- దారావత్ నాగమణి, సాధుతండా, మేళ్లచెరువు

బావిలో నీళ్లు అడుగంటిపోయాయి



పొలాల్లో ఉన్న బావిలో ప్రస్తుతం నీళ్లు అడుగంటిపోయాయి. కోమటికుంట చెరువు ఎండిపోవడంతో బావిలో నీళ్లు లేకుండా పోయాయి. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది.

- బాణోతు ప్రసాద్, కొమ్ముబండ తండా, చిలుకూరు

40 రోజులుగా ఇబ్బందులు



మా గ్రామంలో 40 రోజులకుపైగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. సమస్యను పట్టించుకునే వారే లేరు. మిషన్ భగీరథ నీరు మూడు రోజులకు ఒకసారే వస్తోంది.

- జంగం మీరమ్మ, వేపల సింగారం, హుజూర్‌నగర్ మండలం

మట్టపల్లిలో పంచాంగ శ్రవణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం అర్చకులు పంచాంగ పఠనం చేశారు. ఈసందర్భంగా ఆలయంలో శ్రీస్వామి వారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ఈ ఏడాది జరిగే దేశ కాలమాన పరిస్థితులు , వ్యక్తుల రాశిఫలాలు వివరించారు. అదేవిధంగా నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్,అర్చకులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మట్టపల్లి దేవాలయంలో పంచాంగ పఠనం చేస్తున్న అర్చకులు

‘ఉపాధి’లో ఆమెదే పైచేయి

- 2023-24లో ఎక్కువ పనిదినాలు వినియోగించుకున్నది మహిళలే
- పనులు చేసిన వారిలో పురుషుల కంటే 60.32 శాతం మంది అతివలే అధికం



2023-24లో పని దినాల లక్ష్యం	64,89,816
వినియోగంలో ఉన్న జాబ్‌కార్డులు	1,47,279
పనులకు వచ్చిన కూలీల సంఖ్య	2,63,984
ఇప్పటి వరకు కల్పించిన పనిదినాలు	58,17,981
వంద రోజులు పనిదినాలు పూర్తయిన కుటుంబాలు	2,411
పురుషుల కంటే అధికంగా వచ్చిన మహిళల సంఖ్య	54,504

అర్వపల్లి: మహిళలు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణిస్తున్నారు. అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఇంటిని చక్కదిద్దడమే కాకుండా కుటుంబ పోషణకు కావాల్సిన ఆర్థిక సహకారం తమ వంతుగా సమకూర్చుతున్నారు. ఇదే క్రమంలో వ్యవసాయం, కూలి పనుల్లోను చెమటోడ్చుతున్నారు. ఉపాధి హామీ పథకంలోసైతం పలుగు, పార పట్టి పనులు చేస్తూ ముందుకుసాగుతున్నారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి పనిదినాలను వినియోగించుకున్న వారిలో జిల్లా వ్యాప్తంగా పురుషుల కంటే 60.32 శాతం మంది మహిళలే ఎక్కువ ఉన్నారు.

పలుగు, పార చేతబట్టి..

ఉపాధి హామీ పథకం తొలి రోజుల్లో అధికంగా పురుషులే పనులు చేసేవారు. గిట్టుబాటు వేతనం, చేతినిండా పని లభిస్తుండటంతో మహిళలు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనుల కంటే ఉపాధి హామీ పథకం పనులకే వెళ్లడానికి అతివలు మొగ్గుచూపుతున్నారు, చెరువులు, కుంటలు, కాలువ పూడికతీత, మట్టి రోడ్ల నిర్మాణంలో భాగస్వాములవుతున్నారు.

54,504 మంది మహిళలు ఎక్కువగా..

జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 2,63,984 మంది కూలీలు ఉపాధి పనులు చేశారు. వీరిలో మహిళలు 1,59,244 మంది, పురుషులు 1,04,740 మంది ఉన్నారు. పురుషుల కంటే 60.32 శాతం మంది మహిళలు అధికంగా ఉపాధి పనులు చేశారు. కుటుంబానికి చేదోడువాదోడుగా నిలిచేందుకు ఉపాధి పనులకు వెళ్తున్నట్లు మహిళా కూలీలు చెబుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పనిదినాల లక్ష్యం 90శాతం మేర పూర్తయ్యింది. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు రోజుకు కూలి రూ. 277 ఉండగా దానిని రూ.28 పెంచి రూ.300 రోజు కూలి చేశారు. కొలతల ప్రకారం చేస్తే ఈ విధంగా కూలి గిట్టుబాటు అవుతుంది.

మొత్తం దినాలు పనిచేస్తున్న



పురుషులతో సమానంగా పలుగు, పార చేతబట్టి పనులు చేస్తున్నాం. ప్రస్తుతం ఉపాధి పనులకు పురుషుల కన్నా మహిళలే ఎక్కువగా వస్తున్నారు. ఏడాదికి వంద రోజులు పని కల్పిస్తుండగా మొత్తం దినాలు పూర్తి చేస్తున్నాం.

– అంకిరెడ్డి మంజుల, ఉపాధి పథకం మేట్, అర్వపల్లి

మహిళలు ఆసక్తి చూపుతున్నారు



ఉపాధి హామీ పథకం పనులకు పురుషుల కన్నా మహిళలే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో పనులకు సంబంధించిన లక్ష్యం చేరుకునేలా కలెక్టర్ సూచనలు, సలహాలు పాటిస్తూ ముందుకు వెళుతున్నాం. ఇప్పటి వరకు 90 శాతం లక్ష్యం పూర్తి చేశాం. మిగిలిన టార్గెట్ పూర్తి చేయడానికి పనిచేస్తున్నాం

– మధుసూదన్‌రాజు, డీఆర్‌డీఓ

3 నెలలు.. 53,371 కేసులు

- రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులు
- ప్రమాదాల బారిన పడుతున్నా మారని తీరు
- పోలీసులు జరిమానాలు విధిస్తున్నా పట్టించుకోని యువత



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : రోడ్డు నిబంధనలు పక్కాగా పాటిస్తేనే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకుంటారు. కొందరు యథేచ్ఛగా రోడ్డు నిబంధనలు ఉల్లంఘించడం వల్ల వారు ప్రమాదాలకు గురికావడమే కాకుండా ఎదుటి వారిని ఆపదలోకి నెడుతున్నారు. కనీసం డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపిస్తూ పోలీసులకు చిక్కుతున్నారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు వెళ్లడం, హెల్మెట్ ధరించక పోవడం, అడ్డదిడ్డంగా నడపడం , మద్యం తాగి వాహనాలతో రోడ్డెక్కడం తదితర అంశాలు ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నింపుతున్నారు. కేవలం మూడు నెలల వ్యవధిలోనే వాహనదారులపై జిల్లాలో 53,371 కేసులు నమోదయ్యాయి. పోలీసులు జరిమానాలు విధిస్తున్నా చాలా మందిలో మార్పు రావడం లేదు. వీరిలో ఎక్కువ మంది యువతే ఉండటం ఆందోళనకరం.

నిబంధనలు పాటించని ఆటోవాలాలు..

జిల్లాలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలో ఆటోవాలాలు ముందుంటున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కూలీలను, ఇతరులను తరలించే విషయంలో ఒక్కో ఆటోలో 15 నుంచి 25 మందిని తీసుకెళ్తున్నారు. దీంతో పాటు ఆటోల్లో సౌండ్ బాక్సులు పెట్టి పెద్ద ఎత్తున శబ్దం వచ్చే విధంగా పాటలు పెడుతున్నారు. దీనికి తోడు సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఆటోలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు.

నిత్యం తనిఖీలు..

జిల్లాలో ఎస్పీ, ఏఎస్పీలతో పాటు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగస్వాములవుతున్నారు. నిత్యం వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానాలు విధిస్తున్నారు. అయినా కొందరు చోదకుల్లో మార్పురావడంలేదు.

జనవరి నుంచి మార్చి 31 వరకు ..

విభాగం	కేసులు
సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్	921
అతి వేగంగా వాహనాలు నడపడం	41797
ద్విచక్ర వాహనాలపై ముగ్గురు వెళ్లడం	862
వాహనాలకు సరైన పత్రాలు లేకపోవడం	806
డ్రైవింగ్ లైసెన్సులు లేకపోవడం	3815
హెల్మెట్ ధరించక పోవడం	1987
డ్రంక్ అండ్ డ్రైవ్	2321
డ్రైవింగ్ లైసెన్సు వెంట తెచ్చుకోక పోవడం	862

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. ఇందు కోసం ట్రాఫిక్, పోలీస్ విభాగాల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రహదారులపై ప్రమాదాల నివారణకు సైన్ బోర్డులు, నియంత్రణ చర్యలు తీసుకుంటున్నాం. అన్ని రకాల పత్రాలుంటేనే వాహనాలు నడపాలి. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలిస్తే శిక్షార్హులవుతారు.

– రాహుల్ హెగ్డే, జిల్లా ఎస్పీ

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఉగాది



పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ వెంకటరావు దంపతులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పండితులు వేద పఠనం, ఆశీర్వాద కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ వెంకటరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సంవత్సరంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని పూజలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. కొత్త సంవత్సరంలో జిల్లా ప్రజలకు సుపరిపాలన అందించేలా శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉంటుందని ఆకాంక్షించారు. వివిధ రంగాల్లో పని చేస్తున్న వారంతా ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు గుర్తింపు తేవాలన్నారు. అనంతరం పండితులు క్రోధి నామ సంవత్సర పంచాంగ పఠనం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

జామాయిల్ తోట దగ్ధం



జామాయిల్ తోటకు అంటుకున్న మంటలు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మూడెకరాల జామాయిల్ తోట దగ్ధమైంది. ఈ సంఘటన మంగళవారం ఆత్మకూర్(ఎస్)లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సంకరమద్ది రమణారెడ్డికి గ్రామ సమీపంలో మూడెకరాల జామాయిల్ తోట ఉండగా.. గుర్తు తెలియని వ్యక్తులు తోట సమీపంలో నిప్పంటించారు. మంటలు తోటకు అంటుకుని మూడెకరాల వరకు పూర్తిగా దగ్ధమైంది.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి



భూపతి చిన్న మదార్ (ఫైల్)

నకిరేకల్ : తాటి చెట్టు పైనుంచి పడి ఓ గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన నకిరేకల్ మున్సిపాలిటీలోని బాబాసాహెబ్‌గూడెంలో మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. బాబసాహెబ్‌గూడేనికి చెందిన భూపతి చిన్న మదార్ (62) రోజువారీగా మాదిరిగా స్థానికంగా తాటి చెట్టు ఎక్కేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి జారి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని స్థానిక వార్డు కౌన్సిలర్ కొండ శ్రీనుగౌడ్, కొండ జానయ్యగౌడ్ సందర్శించి నివాళులర్పించారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యంతో ఎస్ఐ సైదిరెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన చింతలపాలెంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి సమీపంలోని గదిలో షేక్ లాల్‌సాహెబ్ నిలువ ఉంచిన సుమారు 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బెల్ట్ దుకాణాలపై పోలీసుల దాడి



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న ఎస్ఐ కె. రంగారెడ్డి

మద్దిగూడ: మండలంలోని ఆయా గ్రామాల్లో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్ దుకాణాలపై ఎస్ఐ కె.రంగారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు దాడి చేశారు. దామెరబీమనపల్లి గ్రామంలో ఐతరాజు పాపయ్య ఇంట్లో అనుమతులు లేకుండా విక్రయిస్తున్న ఓ కంపెనీకి చెందిన 25 బీర్లు స్వాధీనం చేసుకుని, అతడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది శ్రీనివాస్, సైదులు, యాదగిరి, రమేష్, సత్యనారాయణలు ఉన్నారు.

విషాదం మిగిల్చిన ప్రమాదం

- గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందిన యువకుడి అంత్యక్రియలు పూర్తి
- చేతికి వచ్చిన కుమారుడు లేడనే నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్న తల్లి
- అనాథనయ్యానంటూ బోరుమంటున్న పేదరాలు



సతీష్ (ఫైల్)



కుమారుడి మృతదేహం వద్ద రోదిస్తున్న ఉపేంద్ర



ఉపేంద్ర రేకుల గది

అర్వపల్లి: ఆమె జీవనం ఆది నుంచీ కష్టాలమయమే. వివాహమైన కొన్నేళ్లకే అనారోగ్య సమస్యలతో భర్త మృతిచెందగా.. పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకుని రెక్కలు ముక్కలు చేసుకుంటూ కుమారుడితో కలిసి బతుకుపోరు సాగిస్తున్న ఆమెను ఓ రోడ్డు ప్రమాదం విధివంచితగా మార్చింది. చేతికి అందివచ్చిన కుమారుడిని గుర్తు తెలియని వాహనం రూపంలో మృత్యువు కబళించగా ఆమె నా అనేవారు లేక ఒంటరైంది. ఆ అభాగ్యురాలి దీనగాథను చూసి కొమ్మాల గ్రామస్తులు కన్నీటి పర్యంతమవుతున్నారు. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాల గ్రామానికి చెందిన కోనేటి ఉపేంద్ర భర్త సుమారు 20ఏళ్ల కిందటే అనారోగ్య సమస్యలతో మృతిచెందాడు. అయితే, అప్పటికే ఆమెకు ఉన్న ఒక్కగానొక్క కుమారుడు సతీష్ చిన్నపిల్లవాడు. భర్త అకాల మరణంతో ఉపేంద్ర కూలి పనులకు వెళుతూ కుమారుడిని ఇంటర్ వరకు చదివించింది. తల్లి కష్టాలు చూడలేక సతీష్ సూర్యాపేటలో బైక్ మెకానిక్ పని నేర్చుకున్నాడు. మూడేళ్ల నుంచి మెకానిక్‌గా పనిచేస్తూ తల్లికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఉపేంద్ర గ్రామంలో గాజుల వ్యాపారంతో పాటు కూలి పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. వీరికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. పేదరికంతో ఇప్పటికీ శిథిలమైన చిన్నపాటి రేకుల గదిలో తల్లి, కుమారుడు నివసించారు.

విధులు ముగించుకుని వస్తూ...

సతీష్ ప్రతిరోజు సూర్యాపేటకు వెళ్లి అక్కడ మెకానిక్ పనిచేసి రాత్రి తిరిగి ఇంటికి వస్తుంటాడు. రోజు మాదిరిగానే సోమవారం రాత్రి పనిముగించుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో సూర్యాపేట మండల పరిధిలోని రాజానాయక్‌తండా టోల్‌గేట్ వద్ద గుర్తుతెలియని వాహనం అతివేగంగా వచ్చి ఇతడి బైక్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సతీష్ అక్కడికక్కడే మృతిచెందాడు. శరీరం రెండు ముక్కలుగా విడిపోయింది. మృతదేహానికి మంగళవారం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం జరిపించారు. స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.ఇప్పటికే భర్త అకాల మరణంతో కుమిలి పోతున్న ఉపేంద్రను పెళ్లీడుకొచ్చిన కుమారుడు ఇక లేడనే చేదు నిజాన్ని జీర్ణించుకుని గుండెలవిసేలా రోదిస్తోంది. ఆమె రోదనలు చూసి గ్రామస్తులు కంటతడి పెట్టారు. ప్రభుత్వం ఈ అభాగ్యురాలని ఆదుకోవాలని, పక్కా ఇల్లు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఐదుకు చేరిన రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య

- చికిత్స పొందుతూ బాలుడు మృతి



మోక్షిత్ (ఫైల్)

సూర్యాపేట, నాగారం : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 4న ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొట్టిన ప్రమాదంలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న జాజిరెడ్డిగూడెం సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న చింతరెడ్డి సరితారెడ్డి(49), సూర్యాపేట మండలం లక్ష్మీతండాకు చెందిన లునావత్ రుక్కమ్మ (55), నాగారం మండలం పసునూరు గ్రామానికి చెందిన వేదాశ్విని(17నెలలు) అక్కడికక్కడే మృతిచెందగా పలువురు క్షతగాత్రులై వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో జూనియర్ లెక్చరర్ లావణ్య సోమవారం మరణించగా తాజాగా నాగారం మండలం పసునూర్ గ్రామానికి చెందిన గొలుసుల సంధ్య, ఉప్పలయ్య దంపతుల కుమారుడు మోక్షిత్ (7) మంగళవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో మృతిచెందాడు. ఒకే కుటుంబంలో ఇద్దరు చిన్నారులు మృతిచెందడంతో వారి స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఐదు రోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలో ఇద్దరి మృతి

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన గొలుసుల మోక్షిత్ అంత్యక్రియలు ఆదివారం పసునూర్ గ్రామంలో నిర్వహించారు. ఈనెల-5న కూతురు వేదాశ్విని దహన సంస్కారాలు జరిగాయి. ఉప్పలయ్య-సంధ్య దంపతులు ఐదు రోజుల వ్యవధిలోనే చిన్నారులిద్దరినీ కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

నగదు కాజేశాననే ఆరోపణలు అవాస్తవం

- ఈ నెల 6వ తేదీనే రూ.4.60 లక్షలు హెడ్ పోస్టాఫీస్ ఎంఓకి ఇచ్చా
- చివ్వెంల బీపీఎం సాయికృష్ణ వివరణ



సమావేశంలో మాట్లాడుతున్న బీపీఎం సాయి కృష్ణ

చివ్వెంల(సూర్యాపేట) : ప్రభుత్వ నిధులు కాజేశానని తనపై వస్తున్న ఆరోపణలు అవాస్తమని చివ్వెంల బీపీఎం సాయికృష్ణ వివరణ ఇచ్చారు. మంగళవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. 723మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన డబ్బులో రూ.4.60లక్షలను ఈ నెల 6వ తేదీన బ్రాంచ్ పోస్టాఫీస్‌కు పని నిమిత్తం వచ్చిన హెడ్ పోస్టాఫీస్ ఎంఓ ముత్తిని సుధీర్‌బాబుకు ఇచ్చానని, తన వద్ద రూ.24వేలు మాత్రమే ఉన్నట్లు తెలిపాడు. కావాలనే తనపై ఆరోపణలు చేస్తున్నారని ఉన్నతాధికారులు స్పందించి తగు విచారణ చేయాలని కోరాడు.

బీపీఎం డబ్బులు చెల్లించలేదు : ఎంఓ

బీపీఎం సాయికృష్ణ తనకు డబ్బులు చెల్లించలేదని హెడ్ పోస్టాఫీస్ ఎంఓ ముత్తిని సుధీర్‌బాబు తెలిపారు. సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు గత నెల డిపాజిట్ల వివరాలు పరిశీలనకు ఈ నెల 6న బ్రాంచ్ పోస్టాఫీస్‌కు వెళ్లానని తెలిపారు. నగదు గురించి బీపీఎంను అడిగితే బ్యాగు ఇంటి వద్ద మరిచిపోయానని, అదే రోజు సాయంత్రం నాలుగు గంటల వరకు పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేస్తానని చెప్పాడని తెలిపారు. ఈ విషయం వెంటనే సూపరింటెండెంట్‌కు ఫోన్‌లో తెలిపి, సూర్యాపేటకు వచ్చినట్లు తెలిపారు.

గుండెపోటుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి



సైదులు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

త్రిపురారం : గుండెపోటుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామానికి చెందిన సామ సైదులు(49) త్రిపురారం మండలంలోని చెన్నాయిపాలెం జెడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వెళ్లాడు. రాత్రి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో కుటుంబ సభ్యులు అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుడు సైదులుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. దహన సంస్కారాల నిమిత్తం పాఠశాల హెచ్ఎం సైదిరెడ్డి, గోపిలు రూ.20 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావా రవి, మాలోతు దశరథ నాయక్, కిషోర్, పరమేష్, బంగారయ్య, సత్యనారాయణ, చారి, విజయలక్ష్మీ, చిన వెంకన్న, కోట్యా నాయక్, మక్లా, శంకర్, శివ తదితరులు మంగళవారం సైదులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

తాళ్లగడ్డలో మిల్లు సూపర్‌వైజర్..



జమీరుద్దీన్ మృతదేహం

మిర్యాలగూడ టౌన్ : గుండెపోటుతో మిల్లు సూపర్‌వైజర్ మృతిచెందాడు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణంలోని తాళ్లగడ్డకు చెందిన మహ్మద్ జమీరుద్దీన్ (55) యాద్గార్‌పల్లి శివారులోని సాయితేజ సాల్వెంట్ మిల్లులో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం డ్యూటీకి వెళ్లాడు. వీధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో కుప్పకూలాడు. తోటి ఉద్యోగులు అతడిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. సూర్యాపేట జిల్లా బాలాజీనగర్ నుంచి మిర్యాలగూడలోని తాళ్లగడ్డకు వచ్చి జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. మృతుడి తమ్ముడు నసీరుద్దీన్ ఫిర్యాదు మేరకు అసహజ మరణం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

భువనగిరి క్రైం : అనారోగ్య కారణాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. సుమారు 55 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మూడు రోజుల క్రితం భువనగిరి ఏరియా ఆస్పత్రిలో చేరాడు. అతను బూడిద రంగు కలర్ మీద బ్లాకు కలర్ ఫ్లవర్స్ ఉన్న ఫుల్ హాండ్స్ షర్ట్, పసుపు కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. అతని కుడి పక్కటే ముకల మీద పుట్టు మచ్చ ఉన్నది. ఆస్పత్రి సిబ్బంది ఎండీ. సమీరుద్దీన్ ఫిర్యాదు మేరకు మతదేహాన్ని మార్చురీలో భద్రపరచి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరుణ్ కుమార్ తెలిపారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పండుగ పూట విషాదం

- మామిడి కొమ్మల కోసం చెట్టు ఎక్కి కింద పడి వ్యక్తి మృతి
- ఆరేళ్ల క్రితం తల్లి, ఇప్పుడు తండ్రి చనిపోవడంతో అనాథలైన పిల్లలు



మృతి చెందిన పాండు

యాదగిరిగుట్ట: ఉగాది రోజున ఇంటి గుమ్మానికి కట్టేందుకు మామిడి కొమ్మల కోసం చెట్టు ఎక్కగా.. చెట్టు కొమ్మ విరిగి కింద పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాద సంఘటన యాదగిరిగుట్ట మున్సిపాలిటిలోని యాదగిరిపల్లిలో చోటు చేసుకుంది. ఆత్మకూరు(ఎం) మండలం తుక్కాపురంకు చెందిన యాట పాండు (38), తన ఇద్దరు కూతుళ్లతో కలిసి యాదగిరిపల్లిలో గల తన సోదరి ఇంటి వద్ద ఉంటున్నాడు. ఆరేళ్ల క్రితం పాండు భార్య మరణించడంతో పిల్లలతో కలిసి యాదగిరిగుట్టలో కూలిపని చేసుకునేందుకు వచ్చాడు. ఈ క్రమంలోనే ఉగాది పండుగ రోజున అందరిలాగే తన ఇంటికి మామిడి, వేప కొమ్మలు కట్టుకోవాలనుకున్నాడు. ఇందులో భాగంగా యాదగిరిపల్లి సమీపంలో ఉన్న మామిడి చెట్ల వద్దకు వెళ్లి మామిడాకులు కోయడానికి చెట్టు ఎక్కాడు. ఆ చెట్టు కొమ్మ విరిగి పాండు కింద పడిపోయాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పాండును ఆస్పత్రికి తరలించలేదు. దీంతో తీవ్ర గాయాలైన పాండు చెట్టు కిందనే మృతిచెంది ఉన్నాడు. గంట తరువాత వ్యవసాయ బావుల వద్దకు వెళ్తున్న ఓ రైతు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనాథలుగా ఇద్దరు పిల్లలు..

ఆరేళ్ల క్రితం తల్లి.. ఇప్పుడు తండ్రి మరణించడంతో చిన్నారులు అక్షర, ప్రసన్నలు అనాథలుగా మారారు. తండ్రి మరణాన్ని చూసి చిన్నారులు ఇద్దరు బోరున విలపించారు. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు, బంధువులు కన్నీరు పెట్టుకున్నారు.

పెదవీడులో ఉద్రిక్తత.. రాస్తారోకో



పెదవీడులో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

మఠంపల్లి : మఠంపల్లి మండలం పెదవీడులో మంగళవారం రాత్రి రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొని తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవీడు గ్రామంలోని ఓ సామాజిక వర్గానికి చెందిన యువకుడు అదే గ్రామానికి చెందిన మరో సామాజిక వర్గానికి చెందిన యువతిని కొంతకాలంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ విషయం రెండు వర్గాల వారికి తెలియడంతో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మంగళవారం రాత్రి రెండు వర్గాల మధ్య ఇదే విషయంలో తీవ్ర స్థాయిలో వాగ్వాదం, తోపులాట జరిగింది. అనంతరం ఓ వర్గం వారు హుజూర్‌నగర్-మట్టపల్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మఠంపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులను శాంతింపచేశారు.

నీటి సమస్య పరిష్కరించాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న ప్రజలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం క్రాస్‌రోడ్డులో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సూర్యాపేట-జనగామ 365బీ హైవేపై క్రాస్‌రోడ్డు వాసులు రాస్తారోకో చేశారు. నీటి సమస్యను పరిష్కరించాలని నినాదాలు చేశారు. క్రాస్‌రోడ్డు వద్ద పైపులైను పగిలి ఇళ్లకు నీళ్ల రావడంలేదని అన్నారు. అయితే రాస్తారోకోతో రోడ్డుపై పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలిసిన పోలీసులతో పాటు గ్రామ ప్రత్యేక అధికారి శశిధర్‌రెడ్డి అక్కడికి చేరుకొని రెండు రోజుల్లో నీటి సమస్య పరిష్కరిస్తామని ఇచ్చిన హామీతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యురాలు బొల్లం నిమ్మమ్మ, బొల్లం వెంకటేశ్వర్లు, జానయ్య, గోపయ్య, రఘుపతి, నాగమ్మ పాల్గొన్నారు.

మేలుచేసే వేసవి దుక్కులు





కల్టివేటర్ వేస్తున్న రైతు

పెద్దవూర: యాసంగి పంట కాలం పూర్తయితే మెట్ట భూములన్నీ ఖాళీగా ఉంటాయి. ఆ భూములను అలా వదిలేయడం కంటే దుక్కులు దున్నడం, భూసారం పెంపునకు పచ్చిరొట్ట పెంచడం వంటివి చేస్తే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఇన్‌చార్జ్ ఏడీఏ సందీప్ సూచిస్తున్నారు.

ప్రయోజనాలు ఇలా..

- వేసవిలో దుక్కులు దున్నడం వలన భూమిలో తేమను నింపుకునే శక్తి పెరుగుతుంది.
- భూమిలోని గడ్డి పొరలు విడిపోయి భూమి గుల్లబారుతుంది.
- సూక్ష్మజీవులు, వానపాములు పెరిగి సేంద్రియ ఎరువులు పెరుగుతాయి.
- కలుపు మొక్కలు నశిస్తాయి.
- భూమి సారవంతం అవుతుంది. ఎరువులు, పెస్టిసైడ్స్ తక్కువగా ఉపయోగించడం వలన లాభాలు పొందే అవకాశాలు ఉంటాయి.
- పంటలను ఆశించే పురుగులు వేసవిలో నిద్రావస్థలో ఉంటాయి. దుక్కులు దున్నడం కారణంగా పురుగులు పైకి వచ్చి పక్షులకు ఆహారం కావడం లేదా ఎండకు చనిపోతాయి.
- శిలీంద్ర బీజాలు కూడా భూమి లోపల పొరల నుంచి బయటకు వస్తాయి.
- లోతైన దుక్కుల వలన లోపలి వరకు భూమి పొరలుగా విడిపోయి మొక్కల వేళ్లు కూడా లోతు వరకు చేరుకునే అవకాశాలు మెరుగుపడతాయి.
- క్షారాలు, లవణాలు భూమి లోపలి పొరలకు చేరుకుని పైభాగం సరైన పీహెచ్‌లో ఉంటుంది.
- గత పంటకు సంబంధించిన మొక్కలు, వేళ్లు భూమిలో కుళ్లిపోయి ఎరువుగా మారుతాయి. ఎలుకల బెడద తగ్గిపోతుంది.
- వాలుకు అడ్డుగా దుక్కులు దున్నడం వలన నేల కోతకు గురి కాకుండా ఉంటుంది.
- వేసవిలో దున్నకుండా వదిలేస్తే కలుపు మొక్కలు పెరిగి నేలలోని నీటిని, పోషకాలను లాగేస్తాయి. పంట సమయానికి భూమిని నిస్సారంగా మారుస్తాయి. దుక్కులు దున్నడం వలన వీటి బెడద తగ్గుతుంది.
- ముందుగానే దుక్కులు దున్నడం వలన వానాకాలం పంటలు వేసుకునేందుకు మార్గం సుగమం అవుతుంది.

- వేసవిలో కురిసే అకాల వర్షాలను ఉపయోగించుకుని నేల తడిగా మారిన తర్వాత కనీసం 25 నుంచి 30 సెంటిమీటర్ల లోతుకు దున్నుకోవాలి. ఈ దుక్కుల కోసం ప్రత్యేకంగా రెక్క నాగలి, పల్లపు నాగలి ఉపయోగించాలి. యంత్రాలతో దున్నాలంటే డిస్క్ టిల్లర్, రోటవేటర్‌లు వినియోగించాలి. చెరువు మట్టి కలిపి దున్నుకోవడం, కంపోస్టుతో పాటు పచ్చిరొట్ట ఆకులు కలపడం వలన అవి మురిగి ఎరువుగా మారుతాయి.

ఆహార భద్రత గాలికి!

- అధికారుల మధ్య సమన్వయ లోపం
- కల్తీ ఆహార పదార్థాలతో అనారోగ్య పాలవుతున్న ప్రజలు



కలెక్టరేట్ తాళం వేసి ఉన్న ఫుడ్‌సేఫ్టీ కార్యాలయం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సూర్యాపేట జిల్లాలో కల్తీ ఆహార పదార్థాల సరఫరా యథేచ్ఛగా సాగుతోంది. ఎవరైనా సమాచారం అందించినప్పుడు లేదా పోలీసులకు అనుమానం వచ్చి తనిఖీలు చేసినప్పుడు మాత్రమే వీటి కట్టడికి వీలవుతోంది. జిల్లాకు ఇతర రాష్ట్రాలు చేరువలో ఉండటంతో అక్కడి నుంచి కల్తీ పదార్థాలు భారీగా దిగుమతి అవుతున్నాయి. జిల్లాలో సిబ్బంది లేక ఆహార తనిఖీలు అరకొరగా జరుగుతుంటే ... మరోపక్క అధికారుల మధ్య సమన్వయ లోపంతో ఆహార భద్రతను గాలికొదిలేశారన్న విమర్శలు ఉన్నాయి.

సిబ్బంది కొరత..

ఆహార కల్తీ నియంత్రణ శాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి లక్ష మంది జనాభాకు ఒకరు, పట్టణ ప్రాంతాల్లో ప్రతి 50వేల మందికి ఒక ఆహార భద్రత అధికారులు ఉండాలి. నిబంధనల ప్రకారమైతే ఈ లెక్కన ఒక్క జిల్లా కేంద్రంలోనే ఆరుగురు, జిల్లా వ్యాప్తంగా కనీసం 17 మంది సిబ్బంది ఉండాలి. కానీ జిల్లాలో డిజిగ్నేటెడ్ ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్, ఇంచార్జీ ఫుడ్‌సేఫ్టీ అధికారి కేవలం ఇద్దరే విధులు నిర్వహిస్తున్నారు. వీరు కేవలం లైసెన్స్‌లకే పరిమితం కావడంతో తనిఖీల జాడ లేకుండా పోయాయన్న ఆరోపణలు ఉన్నాయి.

చట్టాలు ఇలా..

ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆహార కల్తీ నిరోధక చట్టం 1954, పండ్ల ఉత్పత్తి ఆర్డర్ 1955, మాంసం, వాటి ఉత్పత్తుల ఆర్డర్ 1973, వెజిటెబుల్ ఆయిల్ ప్రొడక్షన్(కంట్రోల్) ఆర్డర్ 1947 తదితర పలు చట్టాలు ఆహార కల్తీని నిరోధించడంకోసం అమలు చేస్తుంది. ఈ చట్టాల సంక్లిష్టత, అమలులో ఇబ్బందులను తొలగించడం కోసం ఫుడ్‌సేఫ్టీ, స్టాండర్డ్ యాక్ట్ -2006ను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. ఆహార పదార్థాల తయారీ, అనుమతితోపాటు, నిల్వ, పంపిణీ, విక్రయాలు, ప్రజల వినియోగం, జాగ్రత్తలపై ప్రమాణాలను ఈ చట్టం నిర్దేశిస్తోంది. మన రాష్ట్రంలో నిబంధనలు, నియమావళి 2011 చట్టం ద్వారా అమలులోకి తెచ్చారు. అనుమతిలేకుండా విక్రయిస్తే ఆరు నెలల జైలు, రూ.లక్ష వరకు జరిమానాను చట్టం విధిస్తారు. ఆరోగ్యానికి హానికరంగా ఉంటే ఏడాది జైలు శిక్ష, రూ.3లక్షల వరకు జరిమానా ఉంటుంది. తీవ్ర అనారోగ్యానికి గురిచేసే ఆహార పదార్థమైతే ఆరు నెలల జైలు శిక్ష, రూ.5లక్షల వరకు జరిమానా వేస్తారు. మృతికి కల్తీ ఆహారం కారణమైతే జీవిత ఖైదు, రూ.10లక్షల వరకు జరిమానా విధించే అవకాశాలు ఉన్నాయి. ఈ చట్టాలు అమలు చేయడంలో అధికారులు విఫలం అవుతున్నారు.

కార్యాలయం ఉన్నా..

జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో ఫుడ్‌సేఫ్టీకి కార్యాలయానికి గదిని కేటాయించారు. కలెక్టరేట్ ప్రారంభమైనా నాటి నుంచి ఈ కార్యాలయం తెరిచిన దాఖాలు లేవు. జిల్లాలో ప్రతి నెలా 12 నమూనాల చొప్పున సేకరించాల్సి ఉంది. ఈ స్థాయిలో తనిఖీలు జరగడంలేదు. ఫలితంగా అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ఆహార తనిఖీలు లేకపోవడం కూడా వారికి వరంగా మారుతోంది. తేలికగా వినియోగదారులను బోల్తా కొట్టిస్తున్నారు. వీటిని ఆహార భద్రత అధికారులు పట్టించుకోకపోవడంతో వీరి అక్రమ వ్యాపారాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రజలు అనారోగ్యం పాలవుతున్నా అధికారులు 'మామూలు'గా తీసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి.

'నల్లగొండ కవుల చరిత్ర' అభినందనీయం

- పద్మశ్రీ డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య

రామగిరి(నల్లగొండ) : 'నల్లగొండ కవుల చరిత్ర' రచించిన పున్నా అంజయ్య అభినందనీయుడని పద్మశ్రీ డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య అన్నారు. శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా మంగళవారం స్థానిక ఎస్‌బీఆర్ గార్డెన్స్‌లో సాహితీ మేఖల సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఉగాది కవి సమ్మేళనం, ఉగాది పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని నీలగిరి కవుల చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ నల్లగొండ జిల్లా సాహిత్యం, కవిత్వం పైన పరిశోధనలు జరుగుతున్న పరిస్థితిలో కవుల చరిత్ర రావడం ఎంతో అవసరమన్నారు. అంబటిపూడి స్ఫూర్తి వల్ల సాహితీ మేఖల తొమ్మిది దశాబ్దాలుగా ఎదిగిందన్నారు. పల్లెలను దైవంగా భావించిన నాకు ఇప్పుడు పల్లెలు చిన్నబోయి వున్నాయని వాటిని చైతన్య పర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ కవులు తమ రచనల ద్వారా సమాజాన్ని చైతన్యం చేయాలన్నారు. మేరెడ్డి యాదగిరిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఉగాది కవి సమ్మేళనంలో కవులు గందూరి లక్ష్మీనారాయణ, బైరెడ్డి కృష్ణారెడ్డి, లక్ష్మయ్య, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.